క్లుప్తంగా

అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం



అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టలో మొదటి రోజు హోమ పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల విగ్రహ, శిఖర ప్రతిష్టాపన ఉత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 6వ తేదీన ప్రతిష్ట అంగరంగ వైభవంగా చేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, ప్రతిష్ట సంకల్పము వంటి పూజలు నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణ మండప పూజలు, మూలమంత్ర హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి



సాంబమూర్తి, లక్ష్మీనారాయణ ముదిరాజ్ చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం

పెదగంట్యాడ: స్వాతంత్య్ర సమరయోధులు బులుసు సాంబమూర్తి, లక్ష్మీనారాయణ ముదిరాజ్ సేవలు మరువలేమని జీవీఎంసీ 77వ వార్డు చేపలపాలెం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్ కుమార్ అన్నారు. పాఠశాలలో నాయకుల జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను విద్యార్థులకు వివరించారు.

ఉత్తమ లైన్‌మన్‌గా ప్రకాష్



ప్రకాష్‌ను సత్కరిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

కూర్మన్నపాలెం: ఉత్తమ లైన్‌మన్‌గా కూర్మన్నపాలేనికి చెందిన అసిస్టెంట్ లైన్‌మన్ ప్రకాష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రకాష్‌ను పలువురు అధికారులు మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యామ్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయుడు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో భద్రతకు ప్రాధాన్యం



ప్రసంగిస్తున్న భద్రతాధికారి సుధీర్‌కుమార్

ఉక్కునగరం: విధి నిర్వహణలో ఉద్యోగులు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్టీల్‌ప్లాంట్ పర్యావరణ నిర్వహణ విభాగాధిపతి జి. ఫణి కుమార్ అన్నారు. జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్టీల్‌ప్లాంట్‌లోని హార్స్‌కో బ్రిక్యూటింగ్ అండ్ మైక్రో పెల్లెట్ ప్లాంట్ సంస్థ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ భద్రతలో రాజీ పడితే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. హార్స్‌కో భద్రతా అధికారి కె. సుధీర్‌కుమార్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి భద్రత, కార్మికుల శ్రేయస్సు చాలా కీలకమన్నారు. ఈ సందర్భంగా పతాక ఆవిష్కరణ, భద్రతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హార్స్‌కో ఆపరేషన్స్ మేనేజర్ పి. శంకర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సారైనా..?!

విశాలమైన ఆ రోడ్డులో అభివృద్ధి పనులు మళ్లీ పట్టా లెక్కాయి. గాజువాక 130 అడుగుల వుడా డబుల్‌రోడ్‌లో అభివృద్ధి పనులు 2017లో ప్రారంభమయ్యాయి. వివిధ అడ్డంకులతో నిలిచిపోయాయి. తర్వాత కదలిక వచ్చినా పనులు ముందుకు సాగలేదు. దీంతో ఆ రోడ్డును ప్రైవేటు వాహనాల పార్కింగ్,ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇలాంటి తరుణంలో మళ్లీ అభివృద్ధి ప్రారంభించడంతో ఈ సారైనా పూర్తి చేస్తారా.. మధ్యలో నిలిపివేస్తారా అని గాజువాక వాసులు చర్చించుకుంటున్నారు.

– గాజువాక



వుడా డబుల్ రోడ్‌లో వాల్ పెయింటింగ్



వుడా డబుల్ రోడ్‌లో చేపట్టిన మొక్కల తొలగింపు

- వుడా డబుల్ రోడ్ అభివృద్ధి పనుల్లో కదలిక
- ప్రతిసారీ అర్ధంతరంగా నిలిచిపోతున్న పనులు
- రూ.10 కోట్లతో నూతన ప్రతిపాదనలు
- ఇప్పుడైనా పూర్తి చేయాలని విన్నపాలు

వృథా ఖర్చే అధికం!

ఈ పనుల కోసం గతంలో చేసిన ఖర్చు అధికంగా వృథా అయిందన్న అభిప్రాయం అందరిలోనూ ఉంది. రోడ్డు ఆధునికీకరణ పేరుతో గతంలో పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేసిన తర్వాత డిజైన్ మార్పు చేయాలని అప్పటి వుడా అధికారులు నిర్ణయించడంతో పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల ఆ రోడ్డును పునర్నిర్మించినప్పటికీ ఐలాండ్‌లను పట్టించుకోవడం మానేశారు. దీంతో అందులో కొత్తగా ఆక్రమణలు కూడా చోటుచేసుకున్నాయి. అప్పట్లో ఈ పనులకు చేసిన ఖర్చు చేసిన నిధులు వృథా అయిపోయాయి.

అభివృద్ధి ప్రణాళిక ఇదీ

పాత ప్రతిపాదనల ప్రకారం రోడ్డు మధ్యలో విశాలమైన ఐలాండ్ నిర్మించడంతో పాటు దాని మధ్యలో వాకింగ్ ట్రాక్, ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని కోసం 2017లో రూ.2.45 కోట్లు కేటాయించారు. కణితి రోడ్డు వంటిల్లు జంక్షన్ నుంచి వందడుగుల రోడ్డులోని గోపాలరెడ్డినగర్ వరకు రెండున్నర కిలోమీటర్ల పొడవునా రోడ్డును అభివృద్ధి చేయడానికి పనులు కూడా ప్రారంభించారు. అప్పట్లో రోడ్డును పాక్షికంగా అభివృద్ధి చేసిన తర్వాత డిజైన్‌ను మార్చాలని నిర్ణయించారు. కొత్త డిజైన్ ప్రకారం వాకింగ్ ట్రాక్, ఐలాండ్ తోపాటు రోడ్డు పొడవునా ఆధునిక లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. మహిళల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకోవడానికి వీలుగా పార్కు, ఫుడ్ స్టాళ్లతో పాటు వాహనాలను నిలపడానికి పార్కింగ్ ఏరియాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఆ పనులు కొంత వరకూ చేపట్టిన తర్వాత పనులు నిలిపివేశారు.

ప్రస్తుత ప్రతిపాదనలు ఇలా

వుడా డబుల్ రోడ్‌లో వివిధ అభివృద్ధి పనులకు తాజాగా ప్రతిపాదనలు రూపొందించారు. సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల్లో గత ప్రతిపాదనలకు కొద్దిగా మార్పులు చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పిచ్చి మొక్కల తొలగింపు కొనసాగుతోంది. కొత్త ప్రతిపాదన ప్రకారం.. వంటిల్లు జంక్షన్ నుంచి గోపాలరెడ్డినగర్ వరకు రోడ్ సెంటర్ స్పేస్‌ను 12 బ్లాకులుగా విభజించారు. ఇందులో ఆరు బ్లాక్‌లలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ ప్రారంభించారు. ఇప్పటికే ఇక్కడ అన్న క్యాంటీన్‌తోపాటు చిన్నపాటి ఓపెన్ జిమ్ అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఈ స్పేస్‌లో గల ఆలయం వెనుక భాగంలో ఒక వేదిక, పార్కు, వాకింగ్ ట్రాక్ మినీ ఇండోర్ స్టేడియం అందుబాటులోకి తీసుకురానున్నట్టు వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి. దీనిలో భాగంగా పిచ్చి మొక్కలు తొలగించి ఐలాండ్ గోడలకు పెయింటింగ్ పనులు ప్రారంభించారు.



తొలగించాల్సిన పిచ్చి మొక్కలు

హాకర్స్ జోన్ పేరిట చేసిన ఖర్చు వృథా

ఇదిలా ఉండగా, ఈ రోడ్డును అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనలకు ముందు హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులు గతంలో నిర్ణయించి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. 130 అడుగుల రోడ్‌లో రెండు పక్కలా 40 అడుగుల చొప్పున రోడ్‌ను అభివృద్ధి చేసి మధ్యలో 50 అడుగల వెడల్పులోకి గాజువాకలోని హాకర్లను తరలించాలని భావించి పనులు చేపట్టారు. హాకర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు కొనుగోలుదారుల వాహనాలకు పార్కింగ్ స్థలం కూడా అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. దీనికోసం అప్పట్లో సుమారు రూ.50లక్షల వరకు ఖర్చు చేసి పనులు చేపట్టారు. దీనిపై స్థానిక వుడా కాలనీ నివాసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చేందుకు విద్యుత్ అధికారులు రూ.45 లక్షలు చెల్లించాలని చెప్పడంతో ఆ పనులు అటకెక్కాయి. దీంతో జీవీఎంసీ చేసిన ఖర్చు వృథా అయిపోయింది. ఆ తర్వాత వుడా అధికారులు కొత్త ప్రతిపాదనలతో రోడ్డు అభివృద్ధికి శ్రీకారం చుట్టినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. ఈ సారైనా పనులు పూర్తి చేయాలని గాజువాక వాసులు కోరుతున్నారు.

అమ్మవార్లకు వెండి, బంగారు వస్తువుల బహూకరణ



వెండి, బంగారు వస్తువులను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్లకు గ్రామానికి చెందిన రామాలయ యూత్ 100 గ్రాముల వెండి, 2 గ్రాముల బంగారంతో చేసిన చెవిదుద్దులు ఆలయ కమిటీ ప్రతినిధులకు మంగళవారం అందజేశారు.

- అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన తెరుకూటి దుర్గారావు, అమ్మాజీ దంపతులు రూ.11116 విరాళం ఇచ్చారు.
- ఆలయ ప్రాంగణంలో ఎలివేషన్‌కు ఎస్ఎస్ గ్రిల్స్ కోసం రూ.50,116 విలువ చేసే నంబారు రమణ, ఝాన్సీ దంపతులు విరాళం అందించారు.
- అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పెరుమాళ్ల గంగరాజు (వీసీడీ), రామలక్ష్మి దంపతుల కుమారుడు పెరుమాళ్ల శ్రీనివాసరావు రూ.50,226లు ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్య హోమం

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–3 కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో మంగళవారం సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ 19వ వార్షికోత్సవాల సందర్భంగా వేకువజామున పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఐ.వి. శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు నిర్వహించిన హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు.

900 కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం తరలిస్తున్న వారిని పట్టుకున్న సివిల్ సప్లై ఆర్‌ఐ బంగార్రాజు

పెదగంట్యాడ: పక్కదారి పట్టిన పేదల బియ్యాన్ని సివిల్ సప్లై ఆర్‌ఐ బంగార్రాజు మంగళవారం పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని బాలచెరువులోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక వీధిలో ఉంటున్న గెంబలి సన్యాసిరావు అనే వ్యక్తి ఆటోలో బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో సివిల్ సప్లై ఆర్‌ఐ బంగార్రాజు సిబ్బందితో దాడి చేశారు. ఆటోలో ఉన్న 900 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను న్యూపోర్టు పోలీసులకు అప్పగించారు.

హిందూ ధర్మ పరివార్ లోగో ఆవిష్కరణ



మాట్లాడుతున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: ఆలయాల అభివృద్ధి, పరిరక్షణ, సనాతన హిందూ ధర్మంపై విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. స్థానిక బీసీ రోడ్డులోని అభయాంజనేయ, సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో హిందూ ధర్మ పరివార్ స్వచ్ఛంద సంస్థ లోగోను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సంతోష్, కార్యదర్శిగా నక్క అప్పన్న కుమార్, ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా రామచంద్రరావు, కోశాధికారిగా లాభాల దుర్గాప్రసాద్, న్యాయ సలహాదారుగా సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య సలహాదారుగా ఎన్‌వై నాయుడు, సలహాదారుగా నారాయణరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తిప్పల నితీష్‌రెడ్డి, కృష్ణంరాజు, భాస్కరభట్ల ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తరలించకపోతే ఆందోళన



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్నాథం, నాయకులు

కూర్మన్నపాలెం: ప్రజలకు ఇబ్బందికరంగా మారిన డంపింగ్ యార్డ్‌ను తరలించాలని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం డిమాండ్ చేశారు. లేకుంటే ఐలా కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. వివిధ కాలనీల ప్రజలతో కలసి మంగళవారం ఆయన డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 87వ వార్డులో పెద్ద సమస్యగా మారిన డంపింగ్ యార్డ్‌పై అధికారులు దృష్టి సారించాలన్నారు. పరిశ్రమ నుంచి చెత్తాచెదారం, మురుగు వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయంపై తక్షణ చర్యలు చేపట్టకపోతే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు విజయరామరాజు, బాబూరావు, అప్పారావు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు

ఏయూ వీసీ రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్



హాజరైన అధికారులు, సిబ్బంది

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధ నేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహిస్తానని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్లు, ఇతర విభాగ అధిపతులతో ఆయన సమావేశమయ్యారు. పరిపాలన విభాగాలలో పని చేస్తున్న సిబ్బంది, వారి విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను పరిరక్షిస్తూ, మరింత పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలని సూచించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను వర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్లు ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఆంధ్రవిశ్వవిద్యాలయానికి వీసీగా నియమితులు కావడం ఎంతో అభినందనీయమన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని ధర్నా



రామాటాకీస్ కూడలిలో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట : ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ కార్మికులకు చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ధర్నాలో భాగంగా రామటాకీస్ కూడలి వద్ద మంగళవారం ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అధిక జరిమానాలకు కారణమవుతున్న 21, 31 జీవోలను రద్దు చేయాలని, డ్రైవర్ల పిల్లలకు స్కాలర్‌షిప్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ట్టుగానే వాహనమిత్ర పథకం కింద ఏటా రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారని, భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్‌టాక్స్, గ్రీన్ టాక్స్, టోల్‌ప్లాజా ఫీజులను 30 శాతం తగ్గిస్తామని హామీ ఇచ్చి తొమ్మిది నెలలు గడిచినా ఒక్క హామీ అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయని పక్షంలో ప్రజా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రతినిధులు యు.శివాజీ, రావికృష్ణ, దేవుడు, ఈశ్వర్, ఎస్.అప్పలరాజు, టి.రవి పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు



శిబిరంలో మాట్లాడుతున్న సిటూ నాయకుడు

కూర్మన్నపాలెం: ఉక్కు యాజమాన్యం అనాలోచిత నిర్ణయాల వల్ల కర్మాగారంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని సిటూ నాయకులు ఆరోపించారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో మంగళవారం పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ నిర్మాణత్మకమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వల్లే కర్మాగారంలోని యంత్రాల సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. దీని వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిటూ నాయకులు డీసీహెచ్ వెంకటేశ్వరరావు, భానుమూర్తి, విజయ్‌కుమార్, రమణ, ఎన్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

తవ్వి వదిలేశారు

అగనంపూడి ప్రధాన బస్టాప్ వద్ద లోతుగా తవ్వి వదిలేసిన రహదారి



ఫోకస్

జాతీయ రహదారి గోతులమయంగా మారడంతో బీటీ రోడ్డు వేస్తున్నారు. మూడు మాసాల నుంచి ఈ పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం ఒకవైపు అనకాపల్లి వంతెన దగ్గర నుంచి అగనంపూడి టోల్‌గేటు వరకు పూర్తి కాగా, మరోవైపు సగం పని పూర్తి చేశారు. వంతెనలు, బస్టాప్‌లు, బస్‌బేలు, వీధి రోడ్ల అనుసంధాన మార్గాల వద్ద ఎక్కడా పనులు చేపట్టలేదు. ఇదిలా ఉంటే అగనంపూడి కూడలి వద్ద బస్టాప్ జాతీయ రహదారిపై ఉండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు, హైవే అథారిటీ అధికారులు కొద్దిగా లోపలికి బస్టాప్ ఏర్పాటు చేసి బస్సులు హైవేపై నిలపకుండా చర్యలు చేపట్టారు. లోపలకు ప్రవేశించి బయటకు వచ్చే మధ్యలో గోతులు తవ్వి వదిలేశారు. 20 రోజులుగా తవ్వి వదిలేయడంతో బస్సులు లోపలకు వెళ్లడం లేదు. దీంతో రోడ్డు మీదే నిలిచిపోతున్నాయని ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. హైవే అథారిటీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– అగనంపూడి

షిప్‌యార్డ్ కార్మికులకు వంద శాతం బీమా

- సీఎండీ హేమంత్ ఖత్రి
- రెన్యూ 2.0 ఆవిష్కరణ



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న షిప్‌యార్డ్ సీఎండీ హేమంత్‌ఖత్రి

సింధియా: షిప్‌యార్డ్‌లో పనిచేసే ప్రతి కార్మికునికి ఏప్రిల్ నుంచి 100 శాతం బీమా కవరేజీ ఉంటుందని సంస్థ సీఎండీ హేమంత్‌ఖత్రి ప్రకటించారు. షిప్‌యార్డ్‌లో ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు సైతం చిన్న చిన్న గాయాలు కూడా నిరోధించడానికి రెన్యూ 2.0 కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో మంగళవారం నిర్వహించిన 54వ జాతీయ భద్రతా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజువారీ జీవితంలో ఆరోగ్యంతో పాటు రోడ్డు భద్రత, పర్యావరణ భద్రత ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించారు. ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ అశోక్‌కుమార్ ఉద్యోగులందరి చేత భద్రతా ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం విద్యార్థులకు, ఉద్యోగులకు వివిధ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.